క్లుప్తంగా

నేడు యథావిధిగా స్పందన

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు.

గోదావరి యాసకు జీవం పోసిన పసలపూడి కథలు

బోట్‌క్లబ్: గోదావరి యాసకు పసలపూడి కథలు జీవం పోశాయని ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల్లో ఆదివారం కె.రామచంద్రారెడ్డి రచించిన వంశీ మా పసలపూడి కథల పరిశోధన గ్రంథం పరిచయ సభ జరిగింది. శేషారెడ్డి మాట్లాడుతూ పసలపూడి కథలు గోదావరి జిల్లాల యాసనూ, మానవీయ విలువలను సమర్థవంతంగా రచయిత వంశీ రచించారన్నారు. కవి, చారిత్రక పరిశోధకులు ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ వంశీ కథల్లో గోదావరి జిల్లాల జీవన విధానాన్ని, మాండలిక భాషా సౌందర్యాన్ని వివరించారన్నారు. కవి,రచయిత అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ వంశీ కథలకు రామచంద్రారెడ్డి పరిశోధన మరింత గౌరవాన్ని తెచ్చిందన్నారు. సాహితీవేత్త పి.ఎస్ ప్రకాశరావు రచయిత పరిశోధనలోని అంశాలను వివరించి అభినందనలు తెలిపారు. పుస్తక ప్రచురణ కర్త సానా వెంకట్రావు మాట్లాడుతూ రామచంద్రారెడ్డితో గల స్నేహాన్ని వివరించారు. అనంతరం రామచంద్రారెడ్డిని సత్కరించారు. కొండూరు రామరాజు, మార్ని జానకిరామ చౌదరి, గొడవర్తి సత్యమూర్తి, కొరుప్రోలు గౌరీనాయుడు, మాకినీడి సూర్యభాస్కర్ పాల్గొన్నారు.

విలయత్ అలీకి ఆత్మీయ వీడ్కోలు

కాకినాడ సిటీ: సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పని చేసి డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా ఇటీవల పదవీ విరమణ చేసిన ఎండీ విలాయత్ అలీ ఆత్మీయ వీడ్కోలు సభ ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం, కాకినాడలో నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డీపీఆర్‌వో కె లక్ష్మీనారాయణ, తూర్పుగోదావరిజిల్లా డీపీఆర్వో ఐ కాశయ్య హాజరై ఎండీ విలాయిత్ అలీ దంపతులనుసత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. విలాయత్ అలీ మాట్లాడుతూ సమాచారశాఖలో విధులు నిర్వహించడం ఒక సవాలుగా తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. సహాయ కార్యనిర్వహక సమాచార ఇంజినీర్లు సి.బాబూరావు, కె.శ్రీనివాసరావు, డివిజన్ పీఆర్వోలు పి.రవి, ఎం.లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడితే తగిన గుర్తింపు

కాకినాడ రూరల్: పార్టీ కోసం సమర్థంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇస్తారనడానికి తనకు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి ఇవ్వడమే ఉదాహరణ అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు లింగం రవి పేర్కొన్నారు. ఇటీవల కాపు కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన లింగం రవిని రాయుడుపాలెం శేషాద్రినగర్‌లోని బాల కనక దుర్గ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రిటైర్డ్ పోలీసు సంక్షేమ సంఘం భవనంలో సన్మానించారు. రవి, చిన్నారి దంపతులను పోతబత్తుల సత్యం, తలుపులమ్మ, తదితరులు ఆధ్వర్యంలో సన్మానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కొత్తపల్లి గిరీష్, సీనియర్ నాయకుడు డీకే వరప్రసాద్, రమణమూర్తి, కామేష్, సత్తిబాబు, గణేష్ పాల్గొన్నారు.

బైక్ మెకానిక్స్ ఆరోగ్య భద్రతకు భరోసా

కాకినాడ: టూవీలర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సుమారు 350 మంది టూవీలర్ ద్విచక్ర వాహన మెకానిక్‌లు హాజరయ్యారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి తపాలాశాఖ ద్వారా అవసరమైన ఇన్సూరెన్స్ సొమ్ము చెల్లించి అందుకు సంబంధించిన బాండ్లు అందజేశారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పాక్షిక వైకల్యం సంభవిస్తే రూ.10 లక్షల వరకు బీమా సొమ్ము అందే విధంగా ఈ పాలసీ రూపొందించారని ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. టూవీలర్ మెకానిక్‌లు ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. వీరికి ఎల్లవేళలా అండగా ఉంటానని సూచించారు. సమావేశానికి హాజరైనవారందరికీ బాండ్లు పంపిణీ చేశారు. సమావేశంలో రాష్ట్ర రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, ద్వారంపూడి ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి(చినబాబు), లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం జగన్

- ఎమ్మెల్యే కన్నబాబు
- తూరంగిలో రైతుబజార్ ప్రారంభోత్సవం


రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులను ప్రోత్సహిస్తూ పలు పథకాలను విజయవంతంగా అమలు చేయటంతో పాటు రైతు పక్షపాతిగా మారిపోయారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. రూరల్ మండలం తూరంగిలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన రైతుబజార్‌ను ఆయన స్థానిక నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆదివారం ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటైన సభలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబు అయితే వ్యవసాయాన్ని పండగ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం అంటేనే భయపడాల్సిన పరిస్థితికి రైతులు వచ్చారు. దీన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని, వ్యవసాయం అంటే పండగని, రైతును రాజుగా చేయాలని తలచి, వారికి అన్నింటా అండగా నిలిచారన్నారు. ఏటా ఖరీఫ్‌కు ముందుగానే పెట్టుబడి సాయాన్ని అందజేస్తూ రైతులపై భారం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. జగన్ పాలన ఐదేళ్ల కాలంలో రైతు సంక్షేమాన్ని సువర్ణాధ్యాయంగా చెప్పవచ్చన్నారు. పెట్టుబడి సాయం అందించడం, వడ్డీ రాయితీ, సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం, పంటల బీమా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం, నాణ్యమైన ఉత్పత్తులను పండించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. వ్యవసాయశాఖను పూర్తిస్థాయిలో ఆధునీకరించి, గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులను నియమించి, పైస్థాయి వరకు వ్యవస్థను బలోపేతం చేశారని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. మార్కెటింగ్‌కు సంబంధించి 60 రైతుబజార్‌లను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి వ్యవసాయ ల్యాబొరేటరీని తీసుకువచ్చామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు జగన్ పాలన ఓ సువర్ణాధ్యాయంగా మిగులుతుందని ఎమ్మెల్యే కన్నబాబు వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సరఫరా చేయటంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్న సిద్ధాంతాన్ని నమ్మిన జగనన్న రైతులకు అన్ని వేళలా ఉండగా ఉంటున్నారన్నారు. కాకినాడ రూరల్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గీసాల శ్రీను మాట్లాడుతూ పేద రైతులు తాము పండించిన పంటను నేరుగా మార్కెట్‌కు తరలించి అమ్ముకునేందుకు వీలుగా రైతుబజార్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు వేయాలి, పంటను గిట్టుబాటు ధరకు ఎలా విక్రయించాలి తదితర విషయాలను రైతులకు అందించడం ద్వారా ప్రతి రైతు తాను పండించిన పంటను అధిక ధరకు అమ్ముకునేందుకు వీలు కలిగిందన్నారు. కౌలు రైతుకూ ప్రభుత్వం రైతు భరోసా అందించి ఆదుకుంటుందని గీసాల శ్రీను అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అనిశెట్టి రామకృష్ణ, గోపిశెట్టి బాబ్జీ, గొల్లపల్లి బాబులు, గరికిన అప్పన్న, పులగల శ్రీనుబాబు, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు పి.సుధాకర్, వెంకటేశ్వరరావు, ఎం.అమ్మాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రెల్లి సామాజిక వర్గానికి అండగా ఉంటా

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- క్వార్టర్స్, కమ్యూనిటీ హాలు ప్రారంభం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


రెల్లి మున్సిపల్ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రెల్లి సామాజిక వర్గానికి అన్నివిధాలా అండగా ఉంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 23వ డివిజన్ రెల్లి వీధిలో రూ.8.40 కోట్ల వ్యయంతో జీప్లస్ 1 విధానంలో 42 క్వార్టర్స్‌తో నిర్మించిన ద్వారంపూడి భాస్కరరెడ్డి మున్సిపల్ భవనాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి ఆదివారం ప్రారంభించారు. గతంలో ఉండే పారిశుద్ధ్య క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో కార్పొరేషన్ సాధారణ నిధులతో వీటి నిర్మించారు. అక్కడ డ్రైన్లు, రహదారులు, మంచినీరు వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రెల్లి సామాజికవర్గ అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. కాకినాడలో కూడా క్వార్టర్స్, కమ్యూనిటీహాలు నిర్మాణంతోపాటు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజారోగ్య పరిరక్షణ కోసం వీరందించే సేవలను ఎల్లప్పుడూ గుర్తిస్తామన్నారు.

రెల్లి సామాజిక వర్గ కమ్యూనిటీ హాలు ప్రారంభం

స్థానిక 31వ డివిజన్‌లో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించిన రెల్లి సామాజికవర్గ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఆదివారం ప్రారంభించారు. దేవీ సీ ఫుడ్స్ సంస్థ తన సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.25 లక్షలు కేటాయించగా మిగిలిన సొమ్మును కార్పొరేషన్ సాధారణ నిధులు ద్వారా వెచ్చించి ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

రజక కమ్యూనిటీ హాలు ప్రారంభం

స్థానిక జగన్నాథపురంలో రూ.కోటి కార్పొరేషన్ సాధారణ నిధులతో నిర్మించిన రజక కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, డీఈ లోవరాజు, మాజీ కార్పొరేటర్లు మీసాల దుర్గాప్రసాద్, మీసాల శ్రీదేవి, ఎఈ వై.నాగేశ్వరరావు, రెల్లిపేట పెద్దలు పాల్గొన్నారు.

యువత మీ వెంటే...


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- చలమలశెట్టికి మద్దతుగా భారీ బైక్ ర్యాలీ
- ప్రారంభించిన ఎమ్మెల్యే ద్వారంపూడి
- గజమాలతో సునీల్‌కు సత్కారం


సునీల్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

కాకినాడ: రానున్న ఎన్నికల్లో మా మద్దతు మీకేనంటూ పెద్ద ఎత్తున యువత ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్‌కు మద్దతు ప్రకటించింది. యువ నాయకులు రాగిరెడ్డి స్వామినాయుడు ఆధ్వర్యంలో దాదాపు 1,500 మంది ఈ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ర్యాలీని ప్రారంభించారు. దారిపొడవునా జై సునీల్ అంటూ నినదిస్తూ చలమలశెట్టిని కలిసి భారీ గజమాలతో సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో సునీల్‌ను గెలిపించుకుంటామంటూ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కో–ఆర్డినేటర్ సునీల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వీరంతా రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం మరింత కష్టించి పని చేయాలని సూచించారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే యువతకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు రాగిరెడ్డి బన్ని పాల్గొన్నారు.

కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని కుటుంబ సభ్యులుగా ఆదరిస్తాం

- ఎమ్మెల్యే కన్నబాబు
- నియోజకవర్గంలోని విశ్వ బ్రాహ్మణులు వైఎస్సార్ సీపీలో చేరిక


ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన విశ్వ బ్రాహ్మణులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీలోకి కొత్తగా వచ్చిన వారిని కుటుంబ సభ్యులుగా ఆదరిస్తామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి అరిపిరాల నాగు ఆధ్వర్యంలో సుమారు 60 మంది విశ్వ బ్రాహ్మణులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో పార్టీలో చేరారు. విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకుడు చిట్టిమోజు శ్రీనివాసరావు, గెద్దనాపల్లి వెంకటరావు, నందిలాడ వెంకటేశ్వరరావు, కణదిండి సుబ్రహ్మణ్యం, గోపాసన శంకరరావు తదితరులు చేరడంతో వీరికి పార్టీ కండువాలు వేసిన కన్నబాబు వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అదే విధంగా పండూరు గ్రామానికి చెందిన మేళం నాగబాబు, నందిపాటి వెంకటరమణ, ముమ్మిడి విష్ణు, గోవిందు, సూరన్న తదితరులు గ్రామ ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, నందిపాటి పల్లయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌పై నమ్మకంతో వైఎస్సార్ సీపీలోకి కొత్తగా చేరుతున్న వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, పార్టీ అధికారంలోకి మరోసారి వచ్చేలా క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని, తగిన గుర్తింపు ఇస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, నాయకులు నందిపాటి సత్తిబాబు, ధర్మరాజు, రాంబాబు, అనుసూరి ప్రభాకర్, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రైవేటు లే అవుట్లకు దీటుగా ప్రభుత్వ స్థలాలు

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నవరత్నాలు–పేదలరందరికీ ఇళ్ల పథకంలో కేటాయించిన ఇళ్ల స్థలాలను ప్రైవేటు లే అవుట్లను తలపించేలా అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సుమారు 714 మందికి సుమారు 15 ఎకరాల్లో పటవల గ్రామంలో కేటాయించిన ఇళ్ల స్థలాలను ఆదివారం అప్పగించారు. స్థలాలను అభివృద్ధి చేసి, హద్దులు నిర్ణయించిన అనంతరం లబ్ధిదారులకు అక్కడ వాస్తవ పరిస్థితిని చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కేటాయించిన స్థలాల్లో త్వరలోనే ఇళ్ల నిర్మాణం కూడా చేపడతామన్నారు. ఎన్నికల అనంతరం 2025 డిసెంబర్‌నాటికల్లా ప్రతీ ఒక్క ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి పేద ప్రజల సొంతింటికల సాకారం చేయాలన్నదే తమ ప్రధాన కర్తవ్యమన్నారు. ఐదేళ్ల క్రితం ఎన్నికల ప్రచారంలో పదివేల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, 30వేల మందికి స్థలాలు ఇవ్వడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. వీరందరికీ ఇచ్చిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి గృహవసతి కల్పించాలన్నదే ఉద్దేశమన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

సర్పవరం ఆలయానికి పోటెత్తిన భక్తులు

నాలుగో మాఘ ఆదివారం తిరునాళ్లు


సర్పవరం ఆలయంలో భావనారాయణస్వామిని దర్శించుకుంటున్న కురసాల కల్యాణ్‌కృష్ణ

కాకినాడ రూరల్: మాఘమాసం సందర్భంగా మండలంలోని సర్పవరం ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయం వద్ద మాఘ నాలుగో ఆదివారం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు ఆవు పిడకలతో పాలు పొంగించి పొంగలి తయారు చేసి సూర్య భగవానుడికి నైవేద్యంగా సమర్పించారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధీనంలోని ఈ ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ భీమేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు, గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, గ్రామ నాయకులు పల్ల చందు, కోటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. గ్రామస్తుల సహకారంతో వచ్చిన భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు. స్వామి వారిని సినీ దర్శకుడు, ఎమ్మెల్యే కన్నబాబు సోదరుడు కురసాల కల్యాణ్ కృష్ణ దర్శించుకున్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ కార్యవర్గం

కరప: స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘభవనంలో ఆదివారం మండల గ్రామ రెవెన్యూ సహాయకులు సమావేశమై, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షేక్ సుబాన్ సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా తెలకారపు గణేష్, ఉపాధ్యక్షుడిగా మండపల్లి దేవానందం, ట్రెజరర్‌గా మల్లవరపు సత్యనారాయణ, 19 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

పేద విద్యార్థులకు సహాయం

కాకినాడ రూరల్: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్(ఆప్త) ఆధ్వర్యంలో పేద తెలుగు విద్యార్థుల విద్యా ఖర్చుల నిమిత్తం ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కాపు కల్యాణ మంటపంలో నిర్వహించిన కార్యక్రమంలో 211మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.35 లక్షలు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. అల్యూమినీ చైర్‌పర్సన్ ఆకుల శ్రీధర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ప్రసంగించారు.

ఘనంగా రంగరాయ స్నాతకోత్సవం



వైద్య పట్టా అందుకుంటున్న విద్యార్థిని

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల 61వ స్నాతకోత్సవంంంం ఆదివారం ఘనంగా జరిగింది. 2018కి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులు వైద్య విద్యా పట్టాలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి డీఎంఈ డాక్టర్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 206 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. అంతకు ముందు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వైద్య, విద్య ప్రాధాన్యతను, సమాజ ఆరోగ్యంలో వైద్యుడి పాత్రను వివరిస్తూ వేసిన నాటిక ఆకట్టుకుంది. రీమిక్స్ పాటలకు, పేరడీలకు విద్యార్థులు తీర్చిదిద్దిన నృత్య రూపకాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహం మాట్లాడుతూ విద్యానంతర జీవితాన్ని, వైద్యుడిగా బాధ్యతను వివరించారు. డాక్టర్ నరసింహాన్ని విద్యార్థులు, బోధకులు సత్కరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌తో పాటు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ వరప్రసాద్, విశ్రాంత ఆర్‌ఎంవో డాక్టర్ సుధీర్‌తో సహా వివిధ విభాగాల బోధకులు, రంగరాయ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

కరప: మండలం సిరిపురంలోని షిరిడీసాయిబాబా మందిర 23వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకరల్తు చిక్కాల వీర వెంకటసత్యనారాయణ(దొరబాబు), సుబ్బారావు సోదరులు ఆదివారం తెలిపారు.

జోరుగా పల్స్ పోలియో


కరపలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు

కాకినాడ: స్థానిక గాంధీనగర్‌లోని ప్రతాప్‌నగర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరసింహనాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 170 కేంద్రాల్లో పోలియో చుక్కలను వేయిస్తున్నామన్నారు. మరో 20 బృందాలు రైల్వే స్టేషన్లు, బస్టాండ్ వంటి వంటి జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేస్తున్నాయన్నారు. మరో ఐదు మొబైల్ టీమ్ లు కూడా పనిచేస్తున్నాయని కమిషనర్ చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ధికారి నరసింహనాయక్ మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 1,320 కేంద్రాలలో పోలియో చుక్కలు వేస్తున్నామన్నారు. హెచ్‌ఓ డాక్టర్ పృథ్వి చరణ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్న కుమార్, డాక్టర్ సురేఖ చౌదరి డాక్టర్ అజీజ్ పాల్గొన్నారు.

కరప: ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషిచేస్తే పోలియో వ్యాధిని నిర్మూలించవచ్చని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ కరప పీహెచ్‌సీ పరిధిలో అయిదేళ్లలోపు చిన్నారులు 3,992 మంది ఉన్నారని, వీరికి పోలియో డ్రాప్స్ వేయడానికి 28 బూత్‌లు, ఒక మొబైల్‌బూత్ ఏర్పాటు చేశామన్నారు. మిగిలినపోయిన పిల్లలకు 4, 5 తేదీలలో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలో అయిదేళ్లలోపు పిల్లలు 2,796 మంది ఉండగా వీరికి పోలియో డ్రాప్స్ వేయడానికి 20 బూత్‌లు, ఒక మొబైల్ బూత్ ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు. వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, ఎస్.నీలిమ, వెలుబంటి సీతారామరాఘవ, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, మద్దూరి భాస్కర్, చింతా బుజ్జి, డాక్టర్ ఈ.సింధూర పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: స్థానిక గొడారిగుంటలో రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె.రత్నకుమార్ ప్రారంభించారు. రోటరీ క్లబ్ కాకినాడ సన్ రైజ్ అధ్యక్షులు కమల్ సందీప్, క్లబ్ సభ్యులు ఏవీ రంగారావు, వి.నగధర్, సతీష్ శెట్టి, ఎం. శ్రీకృష్ణ వర్మ, షేక్ నాగ్ భాషా, ఎమ్ . విజయలక్ష్మి టి. సాయి సుందర్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: మండలంలో వాకలపూడి సచివాయలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు నరసింహ నాయక్ పరిశీలించారు. పండూరు పీహెచ్‌సీ పరిధిలో 5ఏళ్ళ లోపు చిన్నారులు మొత్తం 9,125మంది ఉండగా 8,906 మందికి అనగా 97.6శాతం పోలియో చుక్కలు వేశారు. గైగోలుపాడులో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు జమ్మలమడక నాగమణి పోలియో చుక్కలు చిన్నారులకు వేశారు. రాయుడుపాలెం అంగన్ వాడీ సెంటరులో మాజీ సర్పంచ్ అడబాల వెంకటేశ్వరరావు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.